క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చాపాడు : మండల వ్యాప్తంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ సాయి ప్రసాద్ తెలిపారు. మైదుకూరులోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేయటం జరుగుతుందని, ప్రజలందరూ సహకరించాలని ఏఈ కోరారు.

సీబీఐటీలో వర్క్‌షాప్

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో ఈ నెల 2, 3 వ తేదీలలో ఎంబీఏ విద్యార్థులకు ఎన్ఐఎస్ఎం, కోటక్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్ అనే అంశంపై ఎస్ఈబీఐ, ఎన్ఐఎస్ఎం ట్రైనర్ డా.కె.ప్రభాకరన్ ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరన్ మాట్లాడుతూ లైఫ్ సెటిల్మెంట్‌లో స్మాల్ సేవింగ్ స్కీం, పీపీఎఫ్, పోస్ట్ ఆఫీస్, సుకన్య సమృద్ధి యోజనా వంటి స్కీంలు, గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్‌గా మార్చడం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాలువకు పెరిగిన నీరు



కేసీ చాపాడు కాలువలో పెరిగిన నీరు

రాజుపాళెం : రాజోలి ఆనకట్ట నుంచి మొదలయ్యే కేసీ చాపాడు ప్రధాన కెనాల్‌కు నీరు కొద్దిమేర పెరిగింది. ప్రస్తుతం చాపాడు కాలువకు 300 క్యూసెక్కులు, కేసీ ప్రధాన కాలువకు 395 క్యూసెక్కుల నీరు పోతున్నట్లు కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. ఈ నీరు ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంటలకు మాత్రమే నీటి తడులు అందించుకోవాలని అధికారులు సూచించారు. దాదాపు 18 రోజులపాటు నీరు వస్తుందని వారు చెప్పారు.

అట్లూరు తహసీల్దార్‌గా రవిశంకర్



అట్లూరు : మండల తహసీల్దారుగా శుక్రవారం రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. అట్లూరు తహసీల్దారుగా ఉన్న శ్రీవాణి బద్వేలు ఆర్డీఓ కార్యాలయ ఏఓగా వెళ్లడంతో పోరుమామిళ్ల సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న రవిశంకర్‌ను అట్లూరు తహసీల్దారుగా ఎఫ్ఏసీ ఇస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు 'గడియారం'పై తపాలా కవరు ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హెడ్‌పోస్టాఫీసులో శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రముఖ కవి, అవధాని డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రిపై రూపొందించిన తపాలా కవరును ఆవిష్కరించనున్నట్లు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ (అడిషనల్ చార్జ్) రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి, అవధాని, సాహితీ రంగంలో విశిష్ట సేవలందించిన గడియారం ప్రొద్దుటూరుకు గర్వకారణమని, ఆయన కుటుంబీకులు తపాలాశాఖకు చేసుకున్న దరఖాస్తు మేరకు తపాలాశాఖ ఆమోదం పొంది ప్రత్యేక తపాలా కవరు విడుదల కానుండటం సంతోషదాయకమన్నారు. శనివారం నుంచి హెడ్ పోస్ట్ ఆఫీసులో కవర్లు విక్రయించనున్నట్లు ఆయన వివరించారు.

జూదరుల అరెస్టు

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలో కంప చెట్లలో ఆ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మంగాత్తై అనే జూదం ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ రాజగోపాల్ శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,910 నగదు స్వాధీనం చేసుకున్నామని, ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

నిఘంటువుల పంపిణీ



విద్యార్థులకు నిఘంటువులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఆర్సీఎం ఉన్నత పాఠశాల, నందిపల్లె సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 250 మంది విద్యార్థులకు ఉచితంగా ఆంగ్ల, తెలుగు నిఘంటువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అమృత కలశయాత్రలో యువత

కడప స్పోర్ట్స్: మేరీ మట్టీ.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి సేకరించిన మట్టిని అమృత కలశయాత్రలో భాగంగా జిల్లాకు చెందిన పలువురు యువత ఢిల్లీకి తీసుకువెళ్లి అమృతఘాట్‌లో కలిపినట్లు నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ తెలిపారు. జిల్లా నుంచి వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల నుంచి పట్టుపోగుల సుబ్బారావు, నారాయణ, అబ్దుల్, యశ్వంత్, వాసు పాల్గొన్నట్లు తెలిపారు.

ప్రతి ఆయకట్టు చెరువుకు నీరందిస్తాం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



ఎల్ఎస్పీ ఎడమ కాలువ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు



లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి మున్నెల్లి చెరువుకు చేరుతున్న నీరు

బి.కోడూరు : మండలంలోని అన్ని ఆయకట్టు చెరువులకు దిగువ సగిలేరు ప్రాజెక్టు నుంచి బ్రహ్మంసాగర్ నీరు అందిస్తామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎల్ఎస్పీ ఎడమ కాలువ గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో సాగు చేసిన పంటలు సాగు చేయలేని పరిస్థితి ఉందన్నారు. బోరు వావుల్లో భూగర్భ జలాలు తగ్గి సాగు చేసిన పంటలు సైతం ఎండుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టరు, నీటిపారుదల శాఖ అధికారులను ఒప్పించి నీరు తక్కువగా ఉన్నప్పటికీ చెరువులను నింపేలా చూస్తున్నామన్నారు. వైఎస్ జగన్ పాలనలో రైతు సాగు చేసిన పంట ఎండిపోకూడదన్న ఉద్దేశ్యంలో ప్రత్యేక చొరవ తీసుకుని బ్రహ్మంసాగర్ నీటిని ఎల్ఎస్పీ ద్వారా చెరువులకు అందిస్తున్నామన్నారు. ఈనెల చివర వరకు నీటి సరఫరా జరుగుతుందని, నీరు వృథా కాకుండా అవసరమైన మేరకు వినియోగించుకోవాలని సూచించారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాం నుంచి నీటిని అందిస్తూ పంట ఎండకుండా చూస్తున్నామని తెలిపారు. 2019 నుంచి ఇప్పటి వరకూ వైఎస్ జగన్ ప్రభుత్వంలోనూ బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయడమే కాక బొక్కినేరు నుంచి ఎల్ఎస్పీని నింపుతున్నామన్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చేసిన తప్పిదంతో ఎల్ఎస్పీ గేట్లు కొట్టుకుపోయాయని, అప్పటి నుంచి రెండు ఏళ్లుగా బ్రహ్మంసాగర్ ఎడమ కాలువతో పోరుమామిళ్ల చెరువు నింపి గుండంరాజుపల్లె సబ్ బ్రాంచ్ కెనాల్ ద్వారా మండలంలోని 36 చెరువులకు నీటిని అందించామన్నారు. ఈ ఏడాది గేట్లను అమర్చడం ఆలస్యమైనందున నీటి విడుదల ఆలస్యమైందే తప్ప లేదంటే ఈ సమయానికే చెరువులన్నింటిని నింపేవారమన్నారు. మున్నెల్లి చెరువుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్ ప్రాజెక్టును ప్రారంభించి చెరువుకు నీరు విడుదల చేశారు.

ఎల్లెస్పీ వరప్రసాదని

బి.కోడూరు మండలానికి ఎల్ఎస్పీ వరప్రసాదమని భావించి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ చూపి ప్రాజెక్టు ఆధునీకీకరణ కోసం సుమారు రూ.86 కోట్లు కేటాయించి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే సగం పని పూర్తి కాగా వచ్చే ఏడాది జూన్‌లోపు ఆధునీకికరణను పూర్తి చేసి ఎల్ఎస్పీ ఎడమ కాలువ ద్వారా 500 క్యూసెక్కులు విడుదల చేసి ఒక్క నెలలోనే చెరువులను నింపుతామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, జడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సీ బాషా, సర్పంచ్‌లు మునిరెడ్డి, లక్ష్మినరసారెడ్డి, నీటిపారుదల శాఖ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ నవీన్, నాయకులు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటనారాయణ, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

రాజుపాళెం : బీజేపీ రాజుపాళెం మండల అధ్యక్షుడుగా గోపు లక్ష్మీనరసింహులును ఆ పార్టీ నియమించింది. ఈ సందర్భంగా లక్ష్మీ నరసింహులు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవిలో నియమించిన బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడుగా వంకధార

ప్రొద్దుటూరు క్రైం : బీజేపీ ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షుడుగా వంకధార నరేంద్రరావును నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. పార్టీ పట్ల అంకిత భావంతో, నిబద్ధతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని నరేంద్రారావు ఈ సందర్భంగా తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు రూరల్ అధ్యక్షుడుగా కొర్రపాటి కంబగిరి, ప్రొద్దుటూరు పట్టణ ఇన్‌చార్జిగా బోరెడ్డి సుధాకర్‌రెడ్డిలను నియమించారు.

డీకే చదువులబాబుకు సన్మానం



డీకే చదువుల బాబును సన్మానిస్తున్న నరాల రామారెడ్డి, ఎంఈఓ వంశీకృష్ణ

ప్రొద్దుటూరు : కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబును శుక్రవారం స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో మానస కళా, సాంస్కృతిక సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ డీకే చదువుల బాబు బాల సాహిత్యంలో విశేష కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చాపాడు ఎంఈఓ-2 వంశీకృష్ణ, కార్యదర్శి కొత్తపల్లి శీను, రచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్య, సభ్యులు పాల్గొన్నారు.

మృత్యుంజయ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్ర పర్వదిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి , పారిశ్రామికవేత్త కొప్పూరు రమేష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడండి

మండల సమావేశంలో సర్పంచ్‌లు వేడుకోలు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న

మైదుకూరు : మండలంలో వర్షాభావం వల్ల రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి కనిపిస్తోందని, అందుకు ముందస్తుగా నిధులను సిద్ధం చేసుకోవాలని అధికారులను సర్పంచ్‌లు కోరారు. శుక్రవారం ఎంపీడీఓ ఏవీ రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు నిధులను సిద్ధంగా ఉంచుకోవాలని సర్పంచ్‌లు కోరారు. ఇప్పటికే పంచాయతీల్లో తాగునీటి కోసం తాము ఎంతో ఖర్చు చేశామన్నారు. రాబోవు రోజుల్లో బోర్లలో నీరు అడుగంటడం వల్ల మోటార్లు కాలిపోయే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ముందస్తుగా నిధులు మంజూరు చేయించాలని వారు అధికారులను కోరారు. దీనిపై మండల వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి స్పందిస్తూ ఇప్పటి వరకు సర్పంచ్‌లకు తాగునీటి పథకాల నిర్వహణపై రావాల్సిన బిల్లులు వస్తాయన్నారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద మండలంలో తాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు పనులను ప్రతిపాదించాలని సర్పంచ్‌లకు సూచించారు. మండలంలో కృష్ణ గోపులాపురం, ముత్యాల నగరం, ప్రకాష్ నగర్, సోమయాజుల పల్లె, గణపతి నగరం, విశ్వనాథపురం ఎస్సీ కాలనీ, ఎస్.ఎర్రబల్లె మస్తానయ్యపేట, ఆదిరెడ్డిపల్లె సుగాలి తాండా, సుంకులుగారిపల్లె ఎస్సీ కాలనీ, గల్లావాండ్లపల్లె తదితర గ్రామాల్లో జలజీవన్ కింద నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఏఓ పి.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ మండలానికి పురుగు మందులు పిచికారీ చేసేందుకు రెండు డ్రోన్లు మంజూరయ్యాయని తెలిపారు. రైతులు గ్రూపుగా ఏర్పడి 50 శాతం సబ్సిడీతో డ్రోన్లను పొందవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ థామస్, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ఎత్తిరాజుపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. మండల పరిధిలోని తిరువెంగళాపురం పంచాయతీలోని ఎత్తిరాజుపల్లె, రాఘవరెడ్డి పేట, శ్రీరాంనగర్ ఎస్టీకాలనీ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా బావించి సాగిస్తున్న పాలనతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ప్రతి 50 గడపలకు వలంటీర్‌ను నియమించడంతో పాటు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు వచ్చేలా పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను అమలు చేసి తమది చేతల ప్రభుత్వమని జగనన్న నిరూపించారన్నారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బోడపాడు రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్‌రెడ్డి, పోలిరెడ్డి, సర్పంచ్‌లు సుబ్బనరసింహా, వేణు, ఉప సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, కుప్పాలరమణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మండల నాయకులు శ్రీనివాసులరెడ్డి, గంగయ్య, చంద్ర, ఆవులయ్య, బాలిరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, సీఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు తగవు

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌ను మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విమర్శించడం తగదని 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ చంద్రబాబుకు అనారోగ్య కారణాలతో కోర్టు బెయిలు ఇచ్చిందని, దీనికే టీడీపీ నాయకులు సంబరాలు చేసుకోవడం దేనికని ఎమ్మెల్యే రాచమల్లు అన్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై, సీఎం జగన్ పాలనపై వరద చేసిన విమర్శలు సరికాదన్నారు.

రేపు కెనాన్ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్

కడప కల్చరల్ : ఫొటోగ్రఫీ సంస్థ కెనాన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగర పరిధిలోని జయరాజ గార్డెన్స్‌లో ఉచిత ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి, కడప నగర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్‌రెడ్డి, కార్యదర్శి శివరామకృష్ణలు తెలిపారు. ఈ మేరకు కడపలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని మొక్కు చెల్లించుకున్న ఎంపీపీ



పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

ప్రొద్దుటూరు : జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి, రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎమ్మెల్యేగా హాట్రిక్ కొట్టాలని కోరుతూ ప్రొద్దుటూరు మండల పరిషత్ అధ్యక్షుడు సానబోయిన శేఖర్ యాదవ్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం కర్నూలు జిల్లా నందవరానికి చేరుకుంది. శేఖర్ యాదవ్ ఆయన సతీమణి సర్పంచ్ ప్రశాంతి నందవరంలోని చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. ప్రొద్దుటూరులో సోమవారం పాదయాత్రగా బయల్దేరి శుక్రవారం నందవరానికి చేరుకుంది. ఈ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి హాజరై చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో..



సిద్ధం చేసిన చిట్టి శివలింగాలు



శివలింగాల తయారీలో మహిళలు

- కడప నుంచి కాశీకి ఐదు లక్షల శివలింగాలు
- తయారీలో రోజూ 300 మంది భక్తులు

కడప కల్చరల్ : హరహర మహాదేవ శంభో....అన్న శివనామ స్మరణతో ఆ పరిసరాలు ప్రతిధ్వనిస్తున్నాయి. దాదాపు 300 మంది శివ భక్తులైన మహిళలు ఒకేచోట చేరి మట్టితో చిట్టిచిట్టి శివలింగాలను తయారు చేస్తున్నారు. వారిలో కొన్ని బృందాలు వాటికి తుది మెరుగులు దిద్దుతూ, ఆరబెడుతూ జాగ్రత్తగా ప్యాకింగ్ చేస్తుండడం కార్తీక మాసం రెండు వారాల ముందే వచ్చేసిన అనుభూతిని కలిగిస్తున్నది. కార్తీక మాసంలో పౌర్ణమి నాడు కాశీలో ఇలా రూపొందించిన కోటి చిన్న శివలింగాలతో విశేష పూజలు నిర్వహిస్తారని, దానికి ప్రధాని లాంటి ప్రముఖులు కూడా హాజరవుతారని తెలుస్తోంది. ఇందులో భాగంగా కడప, ప్రొద్దుటూరులోని ధార్మిక సంస్థలు భక్తులకు ఐదు లక్షల శివలింగాలు తయారు చేయాలని సూచించారు. ఈ ప్రాంతాలలో రోజూ దాదాపు 300 మంది మహిళలు దీన్ని ఓ యజ్ఞంగా భావించి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు శివలింగాలను రూపొందిస్తున్నారు. ఒక్కో శివలింగం బొటనవేలంత సైజులో ఉండేలా నల్లబంక మట్టితో నిర్వాహకులు ఇచ్చిన అచ్చుల ద్వారా తయారు చేస్తున్నారు. మట్టిని కూడా కాశీ నుంచి నిర్వాహకులే పంపడంతో స్థానిక భక్తులు దాన్ని నీటితో తడిపి, ఉండలు చేసి అచ్చు పోస్తున్నారు. అక్కడే మధ్యాహ్న భోజనం కూడా తయారు చేసుకుంటున్నారు. స్థానిక చిన్నచౌకులోని ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్‌లో ప్రస్తుతం ఈ తయారీ జరుగుతోంది. స్థానిక భక్తులు, బాలాజీ సేవా సమితి ప్రతినిధులు భారవి, విజయ చంద్రారెడ్డి, రమాదేవి, అమరావతిల పర్యవేక్షణలో విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. తమకు కేటాయించిన ఐదు లక్షల శివలింగాలను పది రోజుల్లో సిద్ధం చేస్తామని వారు తెలియజేశారు.

అవినీతి రహిత సమాజం కోసం కృషి



ర్యాలీని ప్రారంభిస్తున్న కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష

కడప అర్బన్: అవినీతి రహిత సమాజం కోసం కృషి చేయాలని కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష అన్నారు. గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కడపలోని స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి విజిలెన్స్ అవగాహన ర్యాలీని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష ప్రారంభించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసి బస్టాండ్ వరకు ×విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్×లో భాగంగా అవినీతిని వ్యతిరేకిద్దాం, దేశానికి కట్టుబడదాం అనే అంశంపై 300 మంది విద్యార్థులు ప్లకార్డులు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ మాసుంబాష మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చేద్దామన్నారు. దుర్వినియోగాన్ని అరికడదామన్నారు. ఆహార పదార్థాల తయారీలో కల్తీలను అరికడదామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడదామన్నారు. పన్నులు, రుసుములను సక్రమంగా చెల్లించేలా చూసి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి, మౌళిక వసతుల కల్పనకు తోడ్పడదామన్నారు. సహజవనరులను సంరక్షించుకుని వాటిని భావితరాలకు అందిద్దామన్నారు. ఈ ర్యాలీలో విజిలెన్స్ అధికారులు జి. ఈదురుబాష, ఇన్‌స్పెక్టర్ టి. రెడ్డెప్ప, డీఈఈ ఏవీ జవహర్‌రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. శ్రీనివాసులు, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ. బాలగంగాధర్‌రెడ్డి, ఏఈఈలు కె.వి కిషోర్, వి. అశోక్‌కుమార్, అడ్మిన్ ఆఫీసర్ ఎన్.జి. అజీముల్లా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వం కల్పించిన మహిళా రిజర్వేషన్లలో దామాషా ప్రకారం బీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలసి వినతి పత్రం ఇస్తామన్నారు. బీసీ జనగణనను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కేబినెట్‌లో నిర్ణయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పి గురుస్వామి, కోశాధికారి శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ, రాష్ట్ర నాయకురాలు జయశ్రీ, ఉపాధ్యక్షులు కళ్యాణ్ సుధాకర్, పస్తం అంజి, ముఖ్య సలహాదారు సుంకేసుల ఖాదర్ బాషా నరసింహ, మల్లికార్జున నరసింహం, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలను సాగు చేయాలి



చామంతి తోట పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె, ఉప్పరపల్లి రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకు ఎం. నాగరాజు తెలిపారు. రెండు ఆర్బీకేల్లో యూరియా ఎరువులు పుష్కలంగా ఉన్నాయని ఆయన చెప్పారు. అనంతరం గ్రామస్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీలో బోరు బావుల కింద ఆరుతడి పంటలు సాగు చేపట్టాలన్నారు. వరి సాగు ఎట్టి పరిస్థితిల్లోనూ సాగు చేయరాదన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని పెంచాలన్నారు. బొగ్గిడివారిపల్లి చామంతి తోటలను పరిశీలించి కలుపు, సస్యరక్షణ చర్యలతోపాటు పోషక లోప నవరణ చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో సినీ నటులు



కడప కల్చరల్ : కడప అమీన్ పీర్ దర్గాను శుక్రవారం సాయంత్రం స్పార్క్ సినీ బృందం దర్శించుకుంది. దర్గా ముజావర్ అమీర్ వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. హీరో విక్రాంత్ రెడ్డి, హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ పూలచాదర్ స్వయంగా తీసుకొచ్చి దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు వారికి గురువుల విశిష్టతను, చరిత్ర, మహిమల గురించి వివరించారు. సినీ నటులు మాట్లాడుతూ ఈనెల 17న తమ స్పార్క్ సినిమా విడుదల కానున్న సందర్భంగా దర్గా గురువుల ఆశీస్సుల కోసం వచ్చిప్రార్థనలు చేశామన్నారు. ప్రేక్షకులు తమ సినిమాను ఆదరించాలని కోరారు.

రాహుకాల పూజలు



రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళి అమ్మవారికి శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు రాహుకాల పూజ విశేషాలను వివరించారు. పూజలు ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.